ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం..
వర్షాలే ఆలస్యం!

- సబ్ డివిజన్‌లో సాగు విస్తీర్ణం 53,265 ఎకరాలు
- 72 రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సేవలు
- మోస్తరు వర్షాలతో వేసవి దుక్కులు ప్రారంభం

మార్కాపురం/కొనకనమిట్ల: ఖరీఫ్ ప్రణాళికలను వ్యవసాయాధికారులు సిద్ధం చేశారు. మరో వైపు రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే అడపాదడపా కురిసిన వర్షాలతో పొలాల్లో వేసవి దుక్కులు ప్రారంభించారు. నైరుతి రుతుపవనాలు ఒక రోజు ముందే కేరళ తీరాన్ని తాకడం.. ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడతాయని వాతావరణ శాఖ ప్రకటించటంతో రైతులు ముందస్తుగా సేద్యపు పనుల్లో నిమగ్నమయ్యారు. మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు మండలాల్లో ఖరీఫ్‌లో 53,260 ఎకరాలో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనావేశారు. ఇందులో 37,715 ఎకరాలు వర్షాధారం కింద 15,550 ఎకరాలు బోర్లకింద సాగుచేస్తారని అంచనా వేశారు.

చిగురిస్తున్న సాగు ఆశలు

ద్రోణి ప్రభావంతో ఇటీవల పశ్చిమ ప్రకాశంలో వర్షాలు ఓ మోస్తరు వర్షాలు కురవటంతో ఖరీఫ్ సాగుకు రైతులందరూ ఉత్సాహంగా పొలం పనులు మొదలుపెట్టారు. రోహిణి కార్తె వెళ్లిన తర్వాత మృగశిరలో మంచి వర్షాలు పడితే పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఇటీవల కురిసిన వానకు భూములు పదునెక్కడంతో దుక్కులు దున్నారు. పొలంలో చెత్తా చెదారాన్ని తొలగించే పనులతోపాటు పశువుల ఎరువు తోలడం, నేలను చదును చేయటం లాంటి పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అధికారులు సరఫరా చేస్తున్నారు. మరో 15 రోజుల్లోగా వర్షాలు కురవగానే కంది, సజ్జ, జొన్న, పత్తి, మిర్చి పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. తొలకరి ప్రారంభంలో జొన్న, నువ్వులు, పెసర, సజ్జ పంటలపై ఆసక్తి చూపుతారు. అంతర పంటలుగా కంది, సజ్జ, ఆముదం, కొర్ర, జొన్న పంటలు వేసేందుకూ రైతులు సమాయత్తమవుతున్నారు.

విత్తనపంపిణీ ఇలా..

ఇప్పటికే మొదటి విడతగా పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర, 75 క్వింటాళ్లను 50 శాతం రాయితీపై రైతులకు అందుబాటులో ఉంచారు. అవసరమైతే మరో 279 క్వింటాళ్ల విత్తనాలు కూడా అందించేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపారు. సబ్‌డివిన్ పరిధిలో 50 క్వింటాళ్ల మేర రైతులకు అవసరమైన కంది, మినుము, కొర్ర, నువ్వుల పంటల మినీ కిట్స్‌ను అందుబాటులోనికి తీసుకొస్తున్నారు.

4,116 టన్నుల ఎరువుల సరఫరా

ఖరీఫ్ సీజన్‌లో 72 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ ఎరువులు 4,116 టన్నులను మార్క్‌ఫెడ్ ద్వారా అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వర్షం పడిన వెంటనే గ్రామాల్లోని రైతులకు ఎరువులు సరఫరా చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు.


ట్రాక్టర్‌తో పొలం దుక్కి దున్నుతున్న రైతు


కొనకనమిట్ల : పొలాలకు ఎరువు తరలిస్తున్న కూలీలు


పొలంలో తోలిన ఎరువు

ప్రణాళిక సిద్ధం



ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఈ ఏడాది విత్తనాలు, ఎరువుల కొరత లేదు. రైతులకు ఇబ్బంది కలగకుండా ముందు జాగ్రత్తగా సిద్ధం చేస్తున్నాం. మార్కాపురం సబ్‌డివిజన్‌లో మొత్తం 72 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఖరీఫ్‌లో 53,265 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని అంచనా. వర్షాలు పడగానే విత్తనాలు, ఎరువులు, కావాల్సిన మేర అందిస్తాం.

– రమాదేవి, ఏడీఏ, మార్కాపురం

రైతుల వద్దకే విత్తనాలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా సీజనల్‌గా పంటల సాగుకు అవసరమైన విత్తనాలు సరఫరా చేసేందుకు రైతుల వివరాలు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నాం. కొనకనమిట్ల మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాల్లో డిజిటల్ కియోస్క్ మిషన్ల ద్వారా విత్తనాలు, ఎరువులు కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకొని విలేజ్ డిజిటల్ అసిస్టెంట్ వద్ద నగదు చెల్లించాలి. తదుపరి విత్తనాలను నేరుగా రైతులకు అందిస్తాం. ప్రస్తుతం రైతులకు 15 క్వింటాళ్ల జనుములు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రసన్న రంగలక్ష్మి, ఏఓ

క్లుప్తంగా

కార్డెన్ సెర్చ్‌లో ఆటో, 5 బైక్‌లు సీజ్


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ పోలీసులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పీఆర్ కాలనీలో స్థానిక సీఐ వైవీ సోమయ్య కార్డెన్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాలనీలోని పలు గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ తన సిబ్బందితో సహా కలిసి కాలనీలోని ప్రతి గృహాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిస్తూ గృహాల్లో తనిఖీలను ప్రోత్సహించాలన్నారు. అందరి రక్షణ పోలీసుల బాధ్యత అని, అందులో భాగంగానే ప్రతి గృహాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ చట్టాన్ని గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేని ఒక ఆటోతో పాటు 5 బైక్‌లను గుర్తించి వాటిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్సై తోట వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని డీఈ సియానాయక్ తెలిపారు. మార్కాపురం టౌన్, ఇందిరమ్మకాలనీ, వేములకోటలో విద్యుత్ సరఫరా రెండు గంటల పాటు నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

బ్యాంకు ఖాతాలకే పింఛన్ల నగదు

కురిచేడు: పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాలకు జూన్ నెల పింఛన్లు వేస్తున్నట్లు ఎంపీడీఓ సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 4,942 పింఛన్లు ఉన్నాయన్నారు. వాటిలో డీబీటీ ద్వారా 3810 మంది పింఛనుదారులకు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. మిగతా 1132 మంది పింఛన్‌దారులకు నాన్ డీబీటీ ద్వారా ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని చెప్పారు. పింఛన్‌దారులు సహకరించాలని ఆయన కోరారు.

కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలు

దర్శి: ఈ నెల 4వ తేదీన కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై సుమన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సుమన్ మాట్లాడుతూ అన్నీ గ్రామాల్లో గొడవలు జరగకుండా ఉండేందుకు 144 సెక్షన్ అమలు చేసినట్లు తెలిపారు. వీధుల వెంట రంగులు చల్లుకోవడం, గుంపులు గుంపులుగా ఉండటం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం నిషేధించినట్లు తెలిపారు. గ్రామాల్లో బాణసంచా కాల్చినా గెలుపు సంబరాలు చేసినా, రంగులు కొట్టుకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

నేటి నుంచి హనుమాన్ జయంత్యుత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంత్యుత్సవాలు శనివారం నుంచి రెండు రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గొట్లగట్టు గ్రామంలోని అభయ వీరాంజనేయస్వామి, కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో అభయాంజనేయస్వామి, నాయుడుపేట, పాతపాడు, గరిమినపెంట, చినమనగుండం, సిద్ధవరం, మర్రిపాలెం గ్రామాల్లోని వీరాంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. గొట్లగట్టు గ్రామంలో శనివారం గణపతి పూజ, ఆకు పూజా కార్యక్రమాలు, ఆదివారం సువర్చలా ఆంజనేయస్వామి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి స్వామివారి గ్రామోత్సవం ఉంటుందని కమిటీ సభ్యులు వివరించారు. శనివారం కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో పుట్లూరివారిపల్లి గ్రామస్తులు అన్న సంతర్పణ చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి బొడిచర్లలో..

మార్కాపురం రూరల్: మండలంలోని బొడిచర్ల గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం నుంచి 6వ తేదీ వరకు హనుమాన్ జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, గ్రామ పెద్దలు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రోజూ భగవద్గీత, విష్ణు సహస్ర నామ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్న సంతర్పణ కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3వ తేదీన స్వామివారి ఆలయంలో వెంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం, 6వ తేదీన సీతారాముల కల్యాణం నిర్వహిస్తామని, అదేరోజు సాయంత్రం స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


కొనకనమిట్లలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి


ఆకు పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి


పూజల్లో పాల్గొన్న భక్తులు

చింతగుంట్ల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

మార్కాపురం రూరల్: హనుమత్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని చింతగుంట్ల ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ, రఘుశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి ఆకుపూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆంజనేయస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై వైద్యులకు వర్క్‌షాప్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజమన్నార్

మార్కాపురం: మార్కాపురంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్య కళాశాలలో క్యాన్సర్ స్క్రీనింగ్‌పై రెండు రోజుల వర్క్‌షాపును ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీవీ నాగ రాజమన్నార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విశాఖపట్నంకు చెందిన హోమీబాబా క్యాన్సర్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ఆంకాలజీ యూనిట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ తిరుమల రావు బృందం క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్ రాజమన్నార్ మాట్లాడుతూ.. 70 శాతం క్యాన్సర్లను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. డాక్టర్ సావిత్రి గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌కు సంబంధించిన వివిధ రకాల పరీక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రివెంటివ్ ఆంకాలజీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వి.ప్రసన్నరాణి, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

కంభం: యువత తమ జీవనశైలితో క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని స్థానిక ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష ప్రియదర్శిని అన్నారు. హెచ్‌సీ జీఎంఎస్ఆర్ క్యాన్సర్ సెంటర్ ఒంగోలు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ మాట్లాడుతూ బీడీ, సిగరెట్, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉంటే తన జీవితంలో క్యాన్సర్‌కు దూరం కావచ్చన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగంతో అనేక అనారోగ్యాలకు గురవుతారని, అటువంటి సమయంలో వాటిని గుర్తించి వెంటనే వైద్యం చేయించుకుంటే మంచిదని, నిర్లక్ష్యం చేస్తే క్యాన్సర్‌కు దారితీస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివనాయక్, డాక్టర్ విజయచంద్ర, డాక్టర్ శ్రావ్య, లార్డ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఏలియా, రీడ్స్ సంస్థ నిర్వాహకులు అన్నోజిరావు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న వైద్యులు

వైభవంగా సీతారాముల పట్టాభిషేకం

కొనకనమిట్ల: స్థానిక రామదూత క్షేత్రంలో శుక్రవారం సీతారాముల పట్టాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ద్వాదశ శ్రీరామ నామ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శ్రీవైకుంఠ సీతారామచంద్రస్వామికి రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామ కృష్ణాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశబూరు. కల్యాణ ఉభయదాతలుగా చినమనగుండం, పొదిలికి చెందిన గొంట్లా కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం దీక్ష ముగింపుతోపాటు పంచముఖ వీరాంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ, సర్వదేవతా దర్శనం, రాత్రికి గ్రామోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్ రెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, వి.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.


అలంకరణలో సీతారామచంద్రమూర్తి


సీతారామ పట్టాభిషేకంలో పాల్గొన్న ఉభయదాతలు


పూర్ణాహుతి కార్యక్రమంలో భక్తులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కొమరోలు: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ తయారు చేసి అందించాలని మండల విద్యా శాఖాధికారి బొర్రా వెంకటరత్నం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటరత్నం మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో పోషకాహారాలు ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. పరిశుభ్రమైన ప్రదేశంలో మధ్యాహ్న భోజనం తయారు చేయాలని, రోజూ మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థులకు అందించాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులకు భోజన తయారీ పోటీలు నిర్వహించారు. నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని తయారు చేసిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంఈఓలు వెంకటరత్నం, వెంకటేశ్వర్లు అందించారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ పసుపులేటి వెంకటేశ్వర్లు, సీఆర్‌పీలు రామాంజనేయులు, ఆంజనేయులు, రమణయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బొర్రా వెంకటరత్నం

పోలీసుస్టేషన్ ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్పీ హిమంత్ శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారిగా ఆమెను ఎన్నికల కమిషన్ నియమించింది. అందులో భాగంగానే ఆమె పోలీసుస్టేషన్‌ను సందర్శించి 4వ తేదీన కౌంటింగ్ సమయంలో ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారనే విషయాల పై పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు సహకరించేలా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. పోలీసులు అప్రమత్తంగా మెలగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట సీఐ వైవీ సోమయ్య, ఎస్సై తోట వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొనకనమిట్ల: ఎన్నికల కౌంటింగ్ రోజున అందరూ ప్రశాంతంగా ఉండాలని, గ్రామాల్లో అల్లర్లు సృష్టించి గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని గార్లదిన్నె గ్రామంలో రాజకీయ పార్టీల నాయకులతోపాటు ప్రజలతో సమావేశాలు నిర్వహించి శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. పలు వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.


గార్లదిన్నెలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై

ప్రసాద్ సేవలు మరువలేనివి


హాస్టల్ వార్డెన్‌ను సన్మానిస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారి సుబ్బారావు

బేస్తవారిపేట: హాస్టల్ విద్యార్థులకు ప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని బీసీ వేల్ఫేర్ సహాయ సంక్షేమశాఖ అధికారి ఎస్. సుబ్బారావు అన్నారు. స్థానిక బీసీ హాస్టల్ వార్డెన్ మన్నెపల్లి ప్రసాద్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వృత్తిపట్ల అంకిత భావంతో విద్యార్థుల అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. బీసీ హాస్టల్ వార్డెన్లు డి.హరిప్రసాదరావు, ఎస్‌వీపీ ప్రభాకర్ రావు, జె.లక్ష్మీకాంతరెడ్డి, ఎస్.మురళి, పి.బాబూరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు


రత్నమ్మ, శ్యాంబాబు దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

కొనకనమిట్ల: ఉద్యోగ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తే ఎక్కడైనా మంచి గుర్తింపు వస్తుందని స్థానిక ప్రభుత్వ వైద్యశాల సీనియర్ డాక్టర్ శిగినం పెద్దబాలయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత కొన్నేళ్లుగా సీహెచ్‌ఓగా పనిచేస్తున్న తాతపూడి రత్నమ్మ శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలో ఉద్యోగ విరమణ పొందిన రత్నమ్మకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రత్నమ్మ 19 ఏళ్లపాటు ప్రభుత్వ వైద్యశాలల్లో పలు హోదాల్లో పని చేసి ప్రజల మన్ననలు పొందడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. అనంతరం రత్నమ్మ, శ్యాంబాబు దంపతులను ప్రభుత్వ వైద్యులు, తోటి సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గొట్లగట్టు, కొనకనమిట్ల ప్రభుత్వ వైద్యులు బాలయ్య, సురేఖ, పృథ్వీరాజ్, నరేంద్ర, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.